పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో యశ్వంత్ సాయి ప్రతిభ



పతకాలతో కానిస్టేబుల్ యశ్వంత్, పోలీస్ అధికారులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యశ్వంత్ సాయి కరీంనగర్‌లో జరిగిన పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో ప్రతిభ కనబరిచారు. డెక్లథాన్ పోటీల్లో పసిడి, రజతం సాధించడంతో మంగళవారం ఆయనను ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ శ్రీశైలం, ఎస్సైలు సునీల్, గణేష్‌బాబు, శ్రీనివాస్ అభినందించారు.

ఆలయాభివృద్ధికి విరాళం



మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్‌లోని 200 ఏళ్ల పురాతన ఈదమ్మ దేవాలయ అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందించి, ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీంద్రసాగర్ అన్నారు. మంగళవారం ఈదమ్మ దేవాలయం గుడి కమిటీకి రూ.25,116ల విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. దేవాలయ పునర్నిర్మాణంలో పలు పంచుకున్న మల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గూడూరు శైలేష్‌రెడ్డి, సీతాల విజయ్‌లను సత్కరించారు. దేవాలయ కమిటీ సభ్యులు శంకర్‌గౌడ్, తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, గణేష్, నర్సింగ్‌రావు, నరసింహ, నరేందర్, అల్లాడికృష్ణాయాదవ్, రవిగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామివారికి పట్టువస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, మంగాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీవారి కల్యాణమహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో రవీంద్రరెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి అమ్మవారి నిమజ్జనోత్సవం



రామంతాపూర్ : చిన్న చెరువు గ్రౌండ్‌లో శ్రీ సరస్వతి పూజ సమితి ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతి అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవారం సమితి సభ్యులు చిన్నచెరువు గ్రౌండ్ నుంచి మేళా తాళాలు, భజనగీతాలతో ఊరేగింపుగా ఎదులాబాద్ చెరువులో నిమజ్జనం చేశారు. సమితి ప్రతినిధులు సురేష్ సింగ్, రాంప్రకాష్ గుప్తా, భగవాన్‌సింగ్, సునీల్‌కుమార్, కమలేష్ పాండే, అజయ్‌శర్మ, మంజునాథ్ రాజు, ధర్మేందర్, సంతోష్‌గుప్తా, సన్నిసింగ్, పవన్, రాజురాయ్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ కార్డులోనే విద్యార్థి సమగ్ర యోగ్యత వివరాలు



డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణితో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో అపార్ పథకం కొనసాగుతున్న విధానాన్ని ఉపాధ్యాయులను మంగళవారం సర్వ శిక్షా అభియాన్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి నుంచి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్డు వల్ల విద్యార్థికి శాశ్వత గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు, ఇతర ప్రాంతాలలోని పాఠశాలలకు బదిలీ చేయడానికి సులువు అవుతుందని పేర్కొన్నారు.

చర్లపల్లిలో ఆగని కబ్జాలు !

- నాలా బఫర్‌జోన్లలో రాత్రికి రాత్రే నిర్మాణాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో కబ్జాల పర్వం కొనసాగుతోంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకపోవడంతో యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాత్రికి రాత్రే నాలా బఫర్‌జోన్‌లోని స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో స్థానికులు సీసీఎస్ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

◆ చర్లపల్లి, ఇందిరగృహకల్ప కాలనీకి వెళ్లే దారిలో నేతాజీనగర్ కాలనీలో నాలా బఫర్‌జోన్‌ను ఆక్రమించి మూడు షటర్లు నిర్మించారు.

◆ నేతాజీనగర్ అసోసియేషన్ పేరుతో ఓ షెడ్డును అక్రమంగా నిర్మించి బోర్డు కూడా ఏర్పాటు చేశారు. దీనిపై సంబంధిత అధికారుల్లో చలనం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీసీఎస్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



నేతాజీనగర్ కాలనీలో షట్టర్ల నిర్మాణం

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి..

బోడుప్పల్: దేవేందర్‌నగర్ కాలనీలోని సర్వేనంబరు 63/1లోని 1200 గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ దేవేందర్‌నగర్ కాలనీ వీకర్ సెక్షన్ సొసైటీ ఉపాధ్యక్షుడు హైడ్రా కమిషనర్, సీఎం కార్యాలయంలోని ప్రజాపాలనలో వినతిపత్రం అందజేశాడు. స్థానిక నేతలు కబ్జాచేసి పేద, మధ్యతరగతి ప్రజలకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొంత స్థలాన్ని పక్కనే ఉన్న ప్రభుత్వ స్కూల్, మిగిలిన స్థలాన్ని కాలనీ ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీహాల్‌కు కేటాయించాలని విన్నవించారు.



అసోసియేషన్ పేరుతో రాత్రికిరాత్రే నిర్మాణం ఇలా...

అర్చకులకు పెన్షన్ సౌకర్యం కల్పించండి

మంత్రి కొండా సురేఖకు బ్రాహ్మణ ఫెడరేషన్ వినతి

రామంతాపూర్ : 'ఫెడరేషన్ ఆఫ్ ఆల్ బ్రాహ్మిన్స్ అసోసియేషన్' ప్రతినిధులు మంగళవారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న ఆలయాల్లోని అర్చకులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. దేవాదాయశాఖ ఆధీనంలోని దేవాలయాలకు దూపదీప నైవేద్యం పథకం కింద ప్రస్తుతం ఇస్తున్న నెలసరి గ్రాంట్ రూ. 20 వేలను పెంచాలని, హారతి, శతగోప సమర్పణలు అర్చులకు చెందేలా చట్టం చేయాలని ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బ్రాహ్మణ ఫెడరేషన్ ప్రతినిధులు

దీనిపై చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకునేలా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. బ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు ఓగిరాల రమేష్, ప్రధాన కార్యదర్శి గంగు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కుషాయిగూడ: మనకు అందుబాటులో ఉన్న ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ అన్నారు. మంగళవారం కుషాయిగూడలోని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టులో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో 'నల్సా లీగల్ సర్వీస్ టూ పర్సన్స్ విత్ మెంటల్ హిల్‌నెస్ అండ్ పర్సన్ వి ఇంటలెక్చువల్ డిసెబిలిటీస్ స్కీమ్'పై ఎల్‌ఎస్‌యూఎం సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. న్యాయవాదులకు మానసిక వ్యాధి, మేధో వైకల్యానికి సంబంధించిన చట్టాలపై పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సామాన్య ప్రజలను చట్టాలపై చైతన్యపరిచి న్యాయసాయం అందేలా చూడాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ డిసబుల్డ్ చైర్మన్ గంగారామ్, పాపారావు, రాము, సురేష్, జీవన్, జలజ, అర్చన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్

తాగునీటి సౌకర్యం కల్పించాలి

మౌలాలి : మౌలాలి డివిజన్ బృందావన్ కాలనీలోని సుమారు 42 కుటుంబాలకు ఎన్నో ఏళ్ల నుంచి తాగునీటి సౌకర్యం లేదని, వెంటనే తాగునీటి సరఫరా కోసం పైపులైన్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్, ఆ కాలనీవాసులు జలమండలి ఏఈ ఉదయ్‌కు విజ్ఞప్తి చేశారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. వేసవిలో ఆర్‌వో నీటిపైనే చాలా మంది ఆధారపడి ఉన్నారు. కాబట్టి వెంటనే తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ సునీతాశేఖర్ యాదవ్‌ను కోరారు. మల్కాజిగిరి సీనియర్ నాయకుడు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, పోశెట్టి, శంకర్‌రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ సునీతకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

మల్లాపూర్: భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాధా ఆర్ట్స్ అసోసియేషన్ 28వ వార్షికోత్సం సందర్భంగా రక్షక న్నీరు, నాగ భూషణం బిరుదు గ్రహీత, దర్శకుడు మాడుగుల కృష్ణమోహన్ రచించిన చైతన్యరథం సందేశాత్మక నాటికను మంగళవారం మల్లాపూర్ నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ప్రదర్శించారు. ఈ నాటికలు పలువురిని ఆలోచింపజేశాయి. నటుడు కృష్ణమోహన్, నూతన నటీమణి దేవసేన, సహాయ నటులు రమేష్‌గౌడ్, సత్యనారాయణ, నాగరాజు తదితరులున్నారు.

నాలా డీసిల్టింగ్ పనుల పరిశీలన

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నాలా డీసిల్టింగ్ పనులు వేసవిలోనే పూర్తయ్యేలా చూస్తామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. పీవీఎన్ కాలనీలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బండచెరువు దిగువ ప్రాంతంలోని కాలనీల్లో నాలాల ద్వారా వర్షపునీరు లాలాపేట నాలాకు చేరుతోందన్నారు. ఇప్పటి నుంచే డీసిల్టింగ్ పనులు ప్రారంభించి వర్షాకాలం రాకముందే పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నాలా వద్ద ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్‌పోల్‌ను మార్చాలని స్థానికులు కోరగా.. సంబంధిత అధికారులకు సూచించామన్నారు. లైన్‌మెన్ రెడ్యానాయక్, పద్మారావు, ఎస్వీరెడ్డి, రఘు కిషోర్ పాల్గొన్నారు.

జర్నలిజంలో పీహెచ్‌డీ సీట్లను కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం డిపార్టుమెంట్‌లో పీహెచ్‌డీ సీట్లను కల్పించాలని విద్యార్థులు మంగళవారం డీన్, రిజిస్ట్రార్, హెడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరేళ్లుగా వెలువడిన మూడు పీహెచ్‌డీ నోటిఫికేషన్లలో సీట్ల సంఖ్యను (0)గా చూపించారన్నారు. తాజాగా వెలువడిన పీహెచ్‌డీ నోటిఫికేషన్లలో సీట్లను కల్పించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

బోడుప్పల్: శ్రీసాయినగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యారణ్య భారతిస్వామి, మాధవానంద సరస్వతి స్వామిజీలు విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాబలి నివేదన, జయాధిహోమాలు, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కలశోద్వాసన, విగ్రహాలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరించిన తుప్పత్ ఆనంద్ దంపతులను సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ సంతోష్‌కుమార్, కోశాధికారి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రఘుగోపాల్‌రావు, విశ్వనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో కాలనీవాసులు

పేదల అనుకూల బడ్జెట్

కాప్రా: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగు, బలహీనవర్గాల బడ్జెట్ అని, ఏఎస్ రావునగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యారెడ్డి అన్నారు. రాధిక చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ ఉద్యోగులు, మహిళలు, పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేసేలా ఉందని తెలిపారు. బీజేపీ నేతలు అంబటి వెంకటాచలం, గిరిగౌడ్, శివకామేశ్వరి, రజనీకాంత్‌రెడ్డి, సంపత్‌రావు, నర్సిరెడ్డి, ప్రభాకర్, సందీప్, సోమేష్ నాయుడు, మేరి, ఆంజనేయులు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



జర్నలిస్టుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మల్కాజిగిరి: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా డైరీని మంగళవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. త్వరలోనే జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యూనియన్ కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకటరామిరెడ్డి, మల్కయ్య, గోవిందు, మాణిక్యరెడ్డి, చంద్రమోహన్, రాములు, చంద్రమౌళి, విజయ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల బోధనపై ఆరా

అనురాగ్ స్కూల్‌ను సందర్శించిన డీఎంఈ

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని మానసిక వికలాంగుల అనురాగ్ స్కూల్‌ను 'తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ కె.శివరాంప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల తరగతి గదులను కలియతిరిగి వారితో ముచ్చటించారు. వారికి అందించే బోధనా పద్ధతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంఈ శివరాంప్రసాద్‌ను స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ శాలువాతో సత్కరించారు. గాంధీ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.వినోద్ కుమార్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఎంఈ శివరాంప్రసాద్

రాష్ట్రంలో 60 శాతానికి పైగా బీసీ జనాభా

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో బీసీ కులాల జనాభా 60 శాతానికి పైగా ఉందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేపట్టిన కులగణనలో బీసీలు 52 శాతం ఉండగా.. ప్రస్తుత ప్రభుత్వంలో 46 శాతానికి తగ్గించడం బీసీలను మోసగించడమేనన్నారు. గత ప్రభుత్వంలో 7 శాతం ఉన్న ఓసీలు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 15 శాతానికి పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. కులగణనపై విచారణ జరిపించి బీసీలకు న్యాయం చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఓయూలో మాదిగ విద్యార్థుల సంబరాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై కాంగ్రెస్ అనుకూల మాదిగ విద్యార్థి నాయకులు సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట మంగళవారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు. విద్యార్థి సంఘం నాయకుడు నరసింహ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా రగులుతున్న వర్గీకరణ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కరించి తెలంగాణ చరిత్రలో నిలిచారని కొనియాడారు. వర్గీకరణకు సహకరించిన మంత్రి దామోదర రాజనర్సింహ్మ, ఎమ్మెల్యే వీరేశంకు ఓయూ నేతలు సంజయ్, తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాంత్, అజయ్, రాములు, అర్జున్, శివ, సంతోష్ పాల్గొన్నారు.

కేన్సర్‌ను సమూలంగా నిర్మూలించాలి

- అవగాహన ర్యాలీ నిర్వహించిన ఆశావర్కర్లు
- పలుచోట్ల ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు

ఉప్పల్ : ప్రజలంతా ఒక్క తాటిపైకి వచ్చి స్వచ్ఛంద సంస్థలు, సంఘ సేవకులు కేన్సర్‌ను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింట్స్ అండ్ డయాగ్నొస్టిక్ (సీడీఎఫ్‌డీ) జిల్లా వైద్యాధికారుల సంయుక్తాధ్వర్యంలో డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామన్ అధ్యక్షతన మంగళవారం ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం నిర్వహించి కేన్సర్‌పై అవగాహన కల్పించారు.

నివారణకు వ్యాక్సినేషన్..

కేన్సర్ వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని డాక్టర్ రఘునాథస్వామి అన్నారు. చాలా వరకు ప్రపంచ దేశాలు ఈ వ్యాక్సినేషన్ విధానాన్ని అమలు చేస్తున్నాయని, సత్ఫలితాలు కూడా పొందినట్లు సమాచారం ఉందన్నారు. వయస్సు, లింగం బేధం లేకుండా చాలా వరకు వ్యాధి భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సరైన వైద్యంతో నివారణ..

వ్యాధి నిరోధక అంశాలపై వ్యాక్సినేషన్ కోసం సీడీఎఫ్‌డీతో పలు వర్క్‌షాపులను నిర్వహించినట్లు తెలిపారు. ఎంతోమంది కేన్సర్ మహమ్మారితో తమ వాళ్లను పోగొట్టుకున్నారని ముందుగానే గుర్తించి సరైన వైద్యం తీసుకుంటే నివారించగలుగుతామన్నారు. నివారణకు అందరూ సమిష్టిగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథస్వామి తదితరులు

'యునైటెడ్ బై యూనిక్' నినాదంతో..

'యునైటెడ్ బై యూనిక్' అనే నినాదంతో 2025–2027 ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఎమ్ఎన్‌జే మెడికల్ అంకాలజీ ప్రొఫెసర్ డా. రఘునాథరావు అన్నారు. జబ్బు పడిన వారిని ప్రత్యేకంగా కాకుండా అందరితో ఉండేలా ధైర్యం చెబుతూ వైద్యం చేయాలని సూచించారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు, సర్జరీలు వచ్చాయని బయపడాల్సిన అవసరం లేదన్నారు.

సైడ్ ఎఫెక్ట్స్ లేని మందులు..

ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని మందులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని, రోగం వచ్చిన కణాన్ని టార్గెట్ చేసే శక్తివంతమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇమ్యూనియో థెరపీ ద్వారా కేన్సర్ ధరి చేరకుండా ఉండేందుకు వ్యాక్సిన్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు.

9 నుంచి 14 ఏళ్లున్న వారు వ్యాక్సిన్ వేసుకోవాలి..

ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు పుట్టగానే రకరకాల వ్యాక్సిన్లు వేస్తుంటామని, 9 ఏళ్ల నుంచి 14 ఏళ్లున్న ఆడ, మగ పిల్లలు రెండు డోసుల కేన్సర్ వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయించుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్లు సూచిస్తున్నారు.

ప్రతి మంగళవారం ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు

బడ్జెట్ ప్రసంగంలో కేన్సర్ నివారణకు కేంద్రం ముందడుగు వేసిందని, జిల్లా కో– స్క్రీనింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పడం అభినందనీయమని స్వాస్తవ కేన్సర్ కేర్ ఉపాధ్యక్షుడు రామంచంద్ర మూర్తి అన్నారు. దాదాపు 30 రకాల కేన్సర్ మందులపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించడం మంచి పరిణామన్నారు. తమ సెంటర్‌లో ప్రతి మంగళవారం 30 మందికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



ఉప్పల్ చౌరస్తాలో మానవహారం నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

7న కలెక్టరేట్‌లో ఉద్యోగులకు ఉచిత స్క్రీనింగ్ టెస్ట్..

జిల్లా కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు 7న ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్వాస్తవ కేన్సర్ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. జిల్లా వైద్యాధికారులు సహకరిస్తే ప్రతి స్కూల్‌లో వ్యాక్సినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు అయ్యే నిధులు తామే స్వయంగా సమకూర్చుకుంటామని తెలిపారు. దీనికి డీఎంహెచ్‌వో అనుమతులు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ..

ఉప్పల్ పీహెచ్‌సీ ఆశావర్కర్లు, సీడీఎఫ్‌డీ ఉద్యోగులతో కలిసి సీడీఎఫ్‌డీ కార్యాలయం నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆశా వర్కర్లు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. చీఫ్ సైంటిస్టు రమేష్ ఎల్లగొండ్ల, ఉప్పల్ పీహెచ్‌సీ వైద్యాధికారి సౌశీల్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ కేన్సర్‌ను జయించా

ఆరోగ్యంపై అనుమానం రావడంతో పరీక్షలు చేయించుకున్నాను. పరీక్షలలో బ్రెస్ట్ కేన్సర్ అని తేలింది. అప్పటి నుంచి కుటుంబసభ్యుల సహకారంతో ధైర్యంగా కేన్సర్‌ను జయించాను. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాను.

– లలితా ధారా

నేను కూడా కేన్సర్‌ను జయించాను..

జబ్బు వచ్చిన తర్వాత బాధపడేకంటే రాకుండా ముందుగానే చూసుకోవడం మంచిది. ఒక వేళ వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలి.

– చతుర్వేద్, స్వాస్తవ కేన్సర్ కేర్ సీఈవో

సొంతంగా వ్యాక్సిన్‌ను తయారు చేసుకోగల్గుతున్నాం..

30 ఏళ్ల దాటిన మహిళలు, రుతుక్రమం ఆగిపోయిన వారు తప్పకుండా 'బ్రెస్ట్ ఎగ్జామినేషన్,' స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. ఆశా వర్కర్లపై గురుతరమైన బాధ్యత ఉంది. వారు ముందుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్న తర్వాతే అవగాహన కల్పించాలి. గతంలో వ్యాక్సిన్‌ను దిగుమతి చేసుకునే వాళ్లం. ప్రస్తుతం సొంతంగానే తయారు చేసుకోగల్గుతున్నాం.

– డా.లీలా దిగుమర్తి